# జూన్ 16 నుంచి చిత్రకళ ప్రదర్శన

## గోడపత్రిక ఆవిష్కరణ



చిత్రకళ ప్రదర్శన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డా.మామిడి హరికృష్ణ, వ్యవస్థాపకులు రమేశ్

రవీంద్రభారతి, మే 26: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పికాసోది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ మార్క్స్ ఫ్యాషన్ సంయుక్త ఆధ్వర్యంలో పీకాసోది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థినీ విద్యార్థులు గీసిన చిత్రాలతో రవీంద్రభారతిలో జూన్ 16, 17, 18న చిత్రకళ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు పీకాసోది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు రమేశ్ తెలిపారు. రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ కార్యాయలంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ, వ్యవస్థాపకులు రమేశ్ మాట్లాడుతూ.. ఆసక్తి గల చిత్రకళ ఔత్సాహికులు, అభిమానులు అధిక సంఖ్యలో ప్రదర్శనకు హాజరై కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

# లిఫ్ట్ కూలిపోయి.. ఎనిమిది మందికి గాయాలు

## నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



లిఫ్ట్ ప్రమాదంలో గాయపడి ఎల్బీనగర్ కామినేని దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి

మన్సూరాబాద్, మే 26: లిఫ్ట్ కూలిపోయిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఎల్బీనగర్, అల్కాపురి చౌరస్తా సమీపంలోని కినార గ్రాండ్ హోటల్‌లో ఆదివారం జరిగిన ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్‌కు పలువురు హాజరయ్యారు. ఫంక్షన్ ముగిసిన అనంతరం వీరబ్రహ్మమ్మ, రవిశంకర్‌రెడ్డి, మణికంఠ గుప్తా, మనోహర్, సాజిద్ బాబా, కళ్యాణ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు పార్కింగ్ ప్రాంతానికి వచ్చేందుకు 4వ ఫ్లోర్‌లో లిఫ్ట్ ఎక్కారు. కిందకు దిగుతుండగానే లిఫ్ట్ అదుపుతప్పి ఒక్కసారిగా నాలుగో ఫ్లోర్ నుంచి సెల్లార్‌లోకి వేగంగా వచ్చి పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఎనిమిది మందిని వెంటనే 108 అంబులెన్స్‌లో ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కినార గ్రాండ్ హోటల్ యాజమాన్యంపై నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీలో సెల్‌ఫోన్లు..

# శివారుల్లో చైన్ స్నాచర్ల హల్‌చల్

## అంతర్జాతీయ గిరాకీతో పెరిగిన సెల్‌ఫోన్ స్నాచింగ్స్



### నిద్రావస్థలో పెట్రోలింగ్ వ్యవస్థ

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): శివారుల్లో చైన్ స్నాచింగ్‌లు.. సిటీలో సెల్‌ఫోన్ స్నాచింగ్‌ల ముఠాలు చెలరేగిపోతున్నాయి. బంగారం ధరలు పెరగడం.. సెల్‌ఫోన్లను విదేశాలకు తరలిస్తున్న ముఠాలు అందుబాటులో ఉండటంతో స్నాచర్లు బరితెగిస్తున్నారు. అత్తాపూర్‌లో ఓ యువకుడు సెల్‌ఫోన్ స్నాచింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయగా నేరగాళ్లు అతడిని హత్య చేశారు. అలాగే, ఇటీవల శివారు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న మహిళల మెడలోంచి బంగారు గొలుసులు లాక్కుని పారిపోతున్న దుండగులు.. బాధితులను గాయపరుస్తున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. స్థానిక దొంగల ముఠాలతో పాటు అంతర్రాష్ట్ర ముఠాలు రెచ్చిపోతున్నాయి. తాజాగా, 31 మందితో కూడిన సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠాను సిటీ పోలీసులు అరెస్టు చేశారు.

### పాత రోజులు గుర్తుకొస్తున్నాయి..

పదేండ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలో చైన్ స్నాచింగ్‌లు ప్రతి రోజు జరిగాయి. నేరగాళ్లకు చిక్కకుండా ఉండాలంటే.. మహిళలు మెడపై కొంగు వేసుకొని నడవాలని స్వయంగా పోలీసులే సూచించారు. మీ జాగ్రత్తలే మీకు శ్రీరామ రక్ష అని చెప్పారు. ప్రతి రోజు నగరంలో 1 నుంచి 10 స్నాచింగ్ ఘటనలు నమోదయ్యాయి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవస్థీకృత నేరాలను అదుపు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, కార్యాచరణ చేపట్టింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో నేరగాళ్లను ఉక్కుపాదంతో అణిచివేసింది. ఇతర రాష్ట్రాల ముఠాలు నగరం వైపు చూడకుండా చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. స్నాచర్లు తిరిగి హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన స్నాచింగ్ ముఠాల్లో చాలా మంది పాత నేరస్తులే ఉన్నారు. గతంలో ప్రతి స్నాచర్‌కు హైదరాబాద్ పోలీసులంటే భయం ఉండేది. నేడు ఆ పరిస్థితి కనిపించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

### రాత్రి వేళలో ఒంటరిగా..

హైదరాబాద్‌లో రాత్రి వేళల్లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, సెల్‌ఫోన్ స్నాచర్లతో ప్రమాదం పొంచి ఉంటుందని స్వయంగా నగర పోలీసు కమిషనర్ సూచించడం.. స్నాచింగ్ ఘటనల తీవ్రతకు అద్దం పడుతోంది. సెల్‌ఫోన్ స్నాచింగ్ ఘటనలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయంటూ అధికారులే చెబుతున్నారు. స్థానిక సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠాలు కొన్ని అంతర్జాతీయ సెల్‌ఫోన్ దొంగల ముఠాలతో చేతులు కలిపి, అంతర్జాతీయంగా సెల్‌ఫోన్లను విక్రయిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే రెండు ముఠాలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు 1413 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

### వరుస ఘటనలతో..

శివారుల్లో ఒంటరిగా వెళ్లే మహిళలను స్నాచర్లు వదలడం లేదు. వెంటాడి మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు లాక్కొని పారిపోతున్నారు. ఇటీవల రాచకొండలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస స్నాచింగ్‌లు జరిగాయి. చైన్ స్నాచింగ్‌లు, సెల్‌ఫోన్ స్నాచింగ్‌లతో హడలెత్తిస్తున్న నేరగాళ్లను కట్టడి చేయాల్సిన పోలీసులు.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పెట్రోలింగ్ వ్యవస్థలోని లోపాలే స్నాచర్లకు కలిసి వస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో యాంటీ స్నాచింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసినా.. వాటితో ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోతున్నారు. నగరంలో విజుబుల్ పోలీసింగ్‌తో కూడిన పెట్రోలింగ్ ఉంటే కొంతనైనా కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

# బీసీలు తెలంగాణ తరహాలో మరో ఉద్యమం చేయాలి

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు

ఖైరతాబాద్, మే 26: బీసీలకు రాజ్యాధికారం కావాలంటే తెలంగాణ తరహాలో మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉన్నదని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ.. చట్టసభల్లో రోజు రోజుకు బీసీల సంఖ్య తగ్గిపోవడానికి అగ్రవర్ణాల రాజకీయాలే కారణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలకు ఏ పార్టీ కూడా న్యాయం చేయలేదన్నారు. కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారన్నారు. జనాభాలో 50 శాతం కంటే పైనే ఉన్న బీసీలకు చట్టసభల్లో అవకాశాలు రాకుండా చేశారన్నారు. రాష్ట్రంలో త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నదన్నారు. కులగణన, బీసీల లెక్కలు తేల్చకుండానే ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. అదే జరిగితే బీసీలకు మరో ఐదేండ్ల పాటు వెనుకబాటు తప్పదన్నారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ.. ప్రతి నెల చివరి ఆదివారం బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఉంటుందని, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 50 శాతం బీసీలకు పదవులు ఇవ్వాలని, అన్ని మీడియా సంస్థలు 50 శాతం బీసీలకు వార్తల్లో భాగస్వామ్యాన్ని కల్పించాలన్నారు. యూనివర్సిటీల్లో వీసీ పదవులను జనాభా దామాషా ప్రకారం భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ యువజన విభాగం అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీశ్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నల్లతీగల రాజు, లక్ష్మీకాంతం, డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



శివకుమార్

వెంగళరావునగర్, మే 26: రహదారిపై గుంత తవ్వుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనపై గుత్తేదారుతో సహా ముగ్గురిపై నిర్లక్ష్యం, బాలకార్మిక చట్టం కింద ఎస్ ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జనగాం జిల్లాకు దంపతులు జి.సుధాకర్, సునీత జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి అడ్డగుట్ట తుకారాంగేట్ సమీపంలో ఉంటున్నారు. వీరికి పూజిత(19), శివకుమార్(16) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వగ్రామంలో ఎల్లమ్మ పూజ ఉండటంతో భార్యాభర్తలిద్దరూ వెళ్లారు. ఇంట్లో కుమారుడు శివకుమార్ ఉండగా.. దగ్గరి బంధువైన శ్రీను శనివారం రాత్రి అమీర్‌పేట మైత్రీవనం వద్ద హెచ్ఎండీఏ కొనసాగిస్తున్న పునరుద్ధరణ పనుల కోసం తీసుకువచ్చాడు. రాత్రి 11.30 గంటల సమయంలో మైత్రీవనం ఆవరణలో మొక్కలు నాటడం కోసం గుత్తేదారు మహబూబ్ పాషా, సూపర్‌వైజర్ ఖదీర్ పాషా ట్రాక్టర్‌తో తవ్వకపు పనులను బాలుడు శివకుమార్‌తో చేయిస్తున్నారు. తవ్వుతుండగా భూమిలో ఉన్న విద్యుత్ తీగ తగలడంతో శివకుమార్ విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో అక్కడే పడిపోయాడు. వెంటనే బాలుడిని సమీపంలోని దవాఖాకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కుమారుడి మృతి పట్ల ఆందోళనకు దిగారు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు బాలుడిని పనిలోకి పెట్టుకున్న బంధువు శ్రీనుతో పాటు గుత్తేదారు మహబూబ్ పాషా, సూపర్‌వైజర్ ఖదీర్ పాషాపై వివిధ సెక్షన్లతో పాటు బాలకార్మిక చట్టం, జేజే చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



# నగరమంతా ఐపీఎల్ ఫైనల్ సందడి

## గేటెడ్ కమ్యూనిటీల్లో బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు

సిటీబ్యూరో, మే 26 ( నమస్తే తెలంగాణ ): ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌తో ఆదివారం నగరమంతా సందడి నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వాసులంతా ఒకచోట చేరి.. బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేసుకొని మ్యాచ్‌ను వీక్షించారు. కుటుంబ సమేతంగా మ్యాచ్‌ను వీక్షిస్తూ సందడి చేశారు. సన్ రైజర్స్ జెర్సీలను ధరించి అభిమానులు మ్యాచ్‌ను తిలకించారు. మరోవైపు కస్టమర్లను ఆకర్శించేందుకు బార్‌లు, రెస్టారెంట్‌లు, క్లబ్‌లు బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేశాయి. దీంతో రాత్రి 7 నుంచే క్రికెట్ సందడి వ్యాపించింది.

# చికిత్స పొందుతున్న బాలిక మృతి

వెంగళరావునగర్, మే 26: హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల బాలిక ప్రాణాలు విడిచింది. మహబూబాబాద్ కేసముద్రంకు చెందిన ఎనిమిదేళ్ల బాలిక వేసవి సెలువులను గడిపేందుకు రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్ఎస్‌బి.నగర్‌లో ఉంటున్న తాతయ్య యాకయ్య ఇంటికి వచ్చింది. మేడపై ఉన్న మూడో అంతస్తుపై బాలిక మెటల్ టేప్‌తో ఆడుకుంటూ విద్యుత్ షాక్‌కు గురైన విషయం తెలిసిందే. మూడు రోజులుగా గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం ప్రాణాలు విడిచింది. పాప మృతితో రహ్మత్‌నగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మనస్తాపంతో ఆత్మహత్య

బంజారాహిల్స్,మే 26: ఇటీవల భార్య, తండ్రి చనిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన కొండవీటి శివ (48) బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరానగర్‌లో బ్యాంగిల్ స్టోర్ నడిపించాడు. ఏడాది కిందట అతడి భార్య అనారోగ్యంతో చనిపోగా, నెలరోజుల కిందట తండ్రి కూడా మరణించాడు. దీంతో శివ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున అతడు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# మానసిక స్థితి సరిగాలేక..

మణికొండ, మే 26: మానసిక స్థితి బాగలేక మనస్తాపానికి గురైన ఓ యువకుడు తాను నివాసముంటున్న 19వ అంతస్తు భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ఆశీష్ దీపక్ లఖ్వానీ (28) కొన్నాళ్లుగా కోకాపేట గ్రామ పరిధిలోని మైహోం ట్రిక్ష్య అపార్టుమెంటు బ్లాక్-4 19వ అంతస్తులో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతడి మానసికి స్థితి బాగలేదు. ఆదివారం కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉన్న సమయంలో ఆశీష్ దీపక్ బాల్కాని నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా ఆశీష్ మానసిక రుగ్మతకు సంబంధించిన చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# బెస్ట్ టీచర్ నేషనల్ అవార్డుకు ఎంపిక

మణికొండ, మే 26: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ కృషి చేస్తున్నదని అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్ మహ్మద్ షబానా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం నల్లా రాధాకృష్ణ అకాడమీ కార్యాలయంలో షబానాకు అవార్డు పత్రాన్ని అందజేశారు. అనంతరం నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కి హాజరవుతారన్నారు.

# బస్సులో చైన్‌స్నాచింగ్..

## బ్యాంకు ఉద్యోగి గొలుసు మాయం

బంజారాహిల్స్,మే 26: బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దృష్టి మరల్చిన దుండగులు బంగారు గొలుసు కాజేశారు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేటలోని మాగ్నస్ సత్వా అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న శైలేశ్ దయాళ్ కోఠిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 22న డ్యూటీ ముగించుకున్న అనంతరం సుల్తాన్ బజార్ వద్ద బస్సులో షేక్‌పేటకు బయలు దేరాడు. షేక్‌పేటలోని పాస్‌పోర్ట్ ఆఫీస్ సమీపంలోకి రాగానే బస్సులో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి సీటుపై కూర్చున్న శైలేశ్ దయాళ్ పైనుంచి కిటికీ వైపు వంగి.. తనకు వాంతికి వచ్చేలా ఉన్నదని చెప్పాడు. అదే సమయంలో అతడి వెంట ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు కూడా అతడికి సాయం చేస్తున్నట్లు నటించారు. దీంతో శైలేశ్ ఆ సీటు నుంచి వేరే సీటుకు మారాడు. కాసేపటికి షేక్‌పేట బస్‌స్టాప్ రావడంతో బస్సులోనుంచి దిగాడు. ఇంటికి వెళ్లి చూసుకోగా.. అతడి మెడలో ఉండాల్సిన 15 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. బస్సులో తన దృష్టి మరల్చిన వ్యక్తులే గొలుసు కాజేసి ఉంటారని ఆదివారం బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఇటు ఎండా.. అటు వాన

గ్రేటర్‌లో విచిత్ర పరిస్థితి. ఆదివారం ఉదయం నుంచి భానుడు భగభగ మండగా.. గ్రేటర్ వాసులు అల్లాడిపోయారు. బయటకు వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితి. ఓ వైపు చల్లదనం కోసం గొడుగులను ఆశ్రయించి, చల్లని పానియాలను సేవించారు. మధ్యాహ్నం వరకు ఎండ దంచి కొట్టగా.. సాయంత్రం కాగానే వాతావరణంలో మార్పు వచ్చింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదనీరు రోడ్లపైకి రాగా..ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. బారికేడ్లు, చెట్లు విరిగి పడగా, జనజీవనం స్తంభించింది.











నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PACKERS & MOVERS**
★ Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927.
NT-334207

**PEST CONTROL**
★చెదలు, బొద్దింకలు నివారణ. న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227.
NT-334110

**GOLD FINANCE**

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-328144

**OLD AGE HOME**

★వృద్ధులు & భార్యాభర్తలు A/c & N/C అటాచ్డ్ బాత్‌రూం, మేడిపల్లి/ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. Ph: 7981467036, 9391039990, 9515474083.
NT-327838

**TOURS & TRAVELS**

★మహదేవ టూర్స్: 07/07 - అమరనాథ్ + నవదేవి యాత్ర; ★20/09 - చార్‌ధామ్ యాత్ర; ★కార్తీకం 06/11 - కాశీ యాత్ర @ 9908844377.
NT-334106

**PLOT FOR SALE**

★6,50,000/- రూ.లకే 242 చ॥గ॥ 2 గుంటల ఫామ్ ల్యాండ్. పండ్లచెట్లు, కూరగాయలు, ఆకుకూరల పెంపకం. 5 సం॥ Maintenance Free. యాదాద్రి టెంపుల్ @ ఆలేరు టౌన్. 9010155585, 9912155585.
NT-327644

★కే॥ 9 లక్షలకే DTCP అప్రూవ్డ్ ప్లాట్లు నియర్ వంగపల్లి/బీబీనగర్ & ఘట్‌కేసర్ HMDA ప్లాట్లు కలవు. మీ పిల్లల భవిష్యత్తుకై ఇప్పుడే కాల్ చేయండి. 9666703666.
NT-320393

★షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఔట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు సంప్ర: 9949695027.
NT-327828

**రెసిడెన్షియల్ ప్లాట్లు**
★నియర్ యాదగిరిగుట్ట తక్కువ ధరలో రెసిడెన్షియల్ ప్లాట్స్ కలవు. క్లియర్ టైటిల్, ఫ్రీ రిజిస్ట్రేషన్, 40x30 రోడ్. సంప్ర: 6309771255.
NT-320394

**LAND FOR SALE**
★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ॥లు కంపల్సరీ ఉంటుంది. 9177619716.
NT-328341

**HOUSES AND FLATS**
★Independent House for Sale at Banjara Hills, Gated Com. Flat for Sale and Rent at Banjara Hills. 9000755155.
NT-327640

**WANTED**
jobs Apply Now!
★L.B.నగర్ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌నందు లేడీ రిసెప్షనిస్ట్, లేడీ టెలికాలర్లు, మార్కెటింగ్ టీం లీడర్లు కావలెను. మంచి జీతం + కమీషన్ ఇవ్వబడును. Ph: 9440499532 / 8096403602.
NT-327629

★రియల్ ఎస్టేట్ సంస్థ కొరకు సొంత కారు ఉండి, మా కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవము కల్గిన వారికి ఇదే మా ఆహ్వానం. సంప్రదించండి: 7981217883.
NT-339501

**SITUATION VACANT TEACHERS**
★CRPF Public School: Wanted Speech Therapist, Occupational Therapist for CwSN Wing, Hostel Warden (Female) & Supervisor (Female) for CRPF Public School Girls Hostel. Interviews on: 28-05-2024 (Tuesday) @ 09-30 AM: Interested Candidates Walkin Interview along with original Documents at CRPF Public School, GC CRPF, Jawahar Nagar, Secunderabad.
NT-2147

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం)
ప్రతి అదనపు లైనుకు రూ.75/-
Cell: 9848077857
: 9182777126
: 9182777805
: 9182777202
: 9182777806
: 9182777204
E.C.I.L: 9182777125
L.B.నగర్ : 9182777209
: 9182777205